MN 8 PAGE-BPTfffgg:MN 8 PAGE-BPTfff 01/01/2001 10:32 Page 1



## ఆర్డీవో కార్యాలయంలో వాటర్ కూలర్ ఏర్పాటు

**రేపల్లె, అక్టోబరు 3, ప్రభాతవార్త:** పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం రేపల్లె రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వాటర్ కూలర్ సిస్టమ్ ఏర్పాటు చేశారు.ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించే ప్రజలు,కార్యాలయంలో విధులను నిర్వహించే సిబ్బంది సౌకర్యం కోసం వాటర్ కూలర్ సిస్టమ్ ఏర్పాటు చేసినట్లు రోటరీ క్లబ్ ప్రతినిధి ఎంఎం సక్సేనా తెలిపారు.రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి మాట్లాడుతూ తీరప్రాంతంలో రోటరీ క్లబ్ కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. అనంతరం ఆర్డీవో శ్రీదేవిని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు మల్లెల రామచంద్రరావు,జి.పాపారావు ,సిహెచ్.కిషోర్,కె.హరిత, నాగలీల, వి.రాఘవేంద్రరావు,యార్లగడ్డ బుచ్చిరావు,ముక్కామల విఠల్,కోడూరు కృష్ణమూర్తి,చెన్ను సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



# బాపట్ల జిల్లా వార్త



## న్యాయవ్యవస్థలో మధ్యవర్తిత్వం పై అవగాహన

**రేపల్లె, అక్టోబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల ప్రకారం రేపల్లె మండల న్యాయసేవ అధికార కమిటీ సూచనలతో శనివారం మండలంలోని బేతపూడి, తురకపాలెం, ఉయ్యూరు వారిపాలెం గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవ్యవస్థలో భాగంగా మధ్యవర్తిత్వం పై అవగాహన కల్పించారు.ఈ మార్గంలో లభించే ప్రయోజనాలను వెల్లడించారు. సివిల్,క్రిమినల్ కేసుల సత్వర పరిష్కారం కోసం రాజీమార్గమే శ్రేయస్కరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు రాచాబత్తుని శ్రీనివాసరావు, సిహెచ్.నాగమల్లేశ్వరరావు,సయ్యద్ తాహిర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.




## లింగ నిర్ధారణ పరీక్షలు పూర్తి స్థాయిలో అరికట్టడమే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్



**బాపట్ల, అక్టోబర్ 3,ప్రభాతవార్త.ప్రతినిధి: :** లింగ నిర్ధారణ పరీక్షలు పూర్తిస్థాయిలో అరికట్టడమే లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరంగా పరిగణిస్తున్న నేపథ్యంలో స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో బాపట్ల డివిజన్ పరిధిలో 10 స్కానింగ్ సెంటర్లు ఉండగా, చీరాల డివిజన్ లో 33 స్కానింగ్ సెంటర్లు,రేపల్లె డివిజన్ లో 23 స్కానింగ్ సెంటర్లు నడుస్తున్నాయన్నారు.వీటిపై నిరంతర నిఘా అవసరం అన్నారు.ప్రతి వెయ్యి మంది జననంలో పురుష,స్త్రీల నిష్పత్తి సమానంగా లేకపోవడం బాధాకరమన్నారు.ప్రధానంగా యద్దనపూడి మండలంలో 956 మంది పిల్లలు జన్మిస్తే అందులో బాలుర సంఖ్య 504 నమోదు కాగా,బాలికల సంఖ్య 451గా నమోదయ్యిందన్నారు.అలాగే వేమూరు మండలంలో 805 మంది బాలురు జన్మిస్తే,728 మంది బాలికలు జన్మించారన్నారు.ఇదే క్రమంలో అమర్తలూరు,చిన్నగంజాం, మార్టూరు,నిజాంపట్నం మండలాలలో బాలికల జననాల సంఖ్య తక్కువగా ఉండడంపై ఆరా తీశారు.ఆ ప్రాంతాలు డివిజన్ పరిధిలో స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్ చేపట్టాలన్నారు.అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలన్నారు.స్కానింగ్ సెంటర్లో ప్రభుత్వ ప్రైవేటు కార్పొరేట్ వైద్యశాలల వద్ద సిటిజన్ చార్ట్ లు ఏర్పాటు చేయాలన్నారు.ఎవరికైనా సందేహాలు సమస్యలు ఎదురైతే తక్షణమే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్.విజయమ్మ ఫోన్ నెంబర్: 93811 99106ను,లేదా మహిళ శిశు సంక్షేమ శాఖ డిసిపిఓ ఫోన్ నెంబర్:89191 63776 లను సంప్రదించాలన్నారు. ఆసుపత్రులలో సమస్యలుంటే ఈ నెంబర్ కు కాల్ చేసి సమాచారం ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. తదుపరి ఐదు స్కానింగ్ సెంటర్ల పునరుద్ధరణకు కమిటీ ఆమోదించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో డి సి హెచ్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పద్మావతి, డ్రగ్ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి, కమిటీ సభ్యులు కార్పొరేట్ వైద్యశాల డాక్టర్ రామకృష్ణ హనుమాన్, ఎన్జీవో నాయకులు సాల్మన్, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సూర్యలంక బీచ్‌కు రాష్ట్ర స్థాయి స్వచ్ఛ అవార్డు లబించడం అభినందనీయం



**బాపట్ల, అక్టోబర్3,ప్రభాతవార్త,ప్రతినిధి:** పరిశుభ్రమైన పర్యాటక ప్రదేశాలు మరియు వారసత్వ ప్రదేశాలు అంశంపై సూర్యలంక బీచ్ కు రాష్ట్ర స్థాయి స్వచ్ఛ బీచ్ అవార్డు లభించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు,రాష్ట్రస్థాయి స్వచ్ఛ బీచ్ అవార్డు బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ కి లభించడం సంతోషదాయకమని కలెక్టర్ అన్నారు. సూర్యలంక బీచ్ కు స్వచ్ఛ బీచ్ అవార్డు లభించడంపై జిల్లా పర్యాటక శాఖ అధికారి బెనహర్, క్షేత్రస్థాయిలో విశేషంగా కృషి చేసిన అధికారులు, సిబ్బందిని కలెక్టర్ శనివారం అభినందించారు. ఇక్కడకు వచ్చే ప్రజల సహకారంతోనే ఇది సాధ్యమన్నారు. తదుపరి పర్యాటక శాఖ అధికారులు, బీచ్ సూపర్వైజర్, సిబ్బందితో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడలోని ఏవన్ కన్వెన్షన్ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానంలో సూర్యలంక బీచ్ కు అరుదైన గౌరవం దక్కిందన్నారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు జిల్లా పర్యాటక శాఖ అధికారి అందుకున్నారన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. ఇప్పుడు బీచ్ కి వెళ్ళగానే పరిశుభ్రంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో బీచ్ ఉండడాన్ని ప్రజలు ఇష్టపడుతున్నారన్నారు.నిరంతరం పరిశుద్ధ కార్యక్రమాలు, సమన్వయంతో అధికారుల పని తీరు,పర్యవేక్షణ బీచ్ రూపు రేఖలు మార్చేశాయన్నారు. సూర్యలంక బీచ్ కు వెళ్లడానికి ప్రజలు మక్కువ చూపుతున్నారన్నారు.దీంతో సూర్యలంక బీచ్ పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.వారంలో ఒకరోజు బీచ్ వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహణకు ప్రణాళికల రూపొందించాలని ఆయన సూచించారు.

## మత్తు పదార్థాల అక్రమ రవాణా పై హంటర్ కన్ను

**బాపట్ల పోలీస్ శాఖలోకి**
**నూతనంగా బెల్జియన్ మాలినోయిస్ జాతి జాగిలం**
**11 నెలల పాటు ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకున్న హంటర్**

**బాపట్ల, అక్టోబర్3,ప్రభాతవార్త.ప్రతినిధి:**

బాపట్ల జిల్లాలో గంజాయి,ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా,విక్రయాలు,వినియోగానికి చెక్ పెట్టేందుకు పోలీస్ శాఖ నిఘాను మరింత పటిష్టం చేసింది.ఇందులో భాగంగా నూతనంగా చేరిన హంటర్ అనే బెల్జియన్ మాలినోయిస్ జాతికి చెందిన స్నిఫ్ఫర్ డాగ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.



శనివారం జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో అడ్మిన్ ఆర్ఐ షేక్ మోలుద్దీన్ హంటర్ను, దాని హ్యాండ్లర్లను ఎస్పీ ఉమా మహేశ్వర్ ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హంటర్ నైపుణ్యాలు, దానికి ఇచ్చిన శిక్షణ విధానంపై ఎస్పీ వివరాలు అడిగి తెలుసుకున్నారు.11 నెలల కఠిన శిక్షణ.ఒకటిన్నర సంవత్సరాల వయస్సు ఉన్న ఈ హంటర్‌జాగిలానికి మంగళగిరి సిటిసి 6వ బెటాలియన్‌లోని నార్కోటిక్, ట్రాకర్ విభాగాల్లో 2025 అక్టోబర్ 24 నుంచి 2026 సెప్టెంబర్ 30 వరకు సుదీర్ఘంగా 11 నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రహస్యంగా దాచి ఉంచిన గంజాయి,ఇతర మత్తు పదార్థాలను,అలాగే నేరస్థుల ఆనవాళ్లను గుర్తించడంలో ఇది దిట్ట.2012 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు కె. నరేష్,ఏడుకొండలు దీనికి హ్యాండ్లర్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా పోలీస్ శాఖ వద్ద ఇటువంటివి మొత్తం ఐదు జాగిలాలు అందుబాటులో ఉన్నాయన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకుఆపరేషన్ త్రిశూల్‌ద్వారా కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండేలా 661 ఈగిల్ క్లబ్‌లను ఏర్పాటు చేసి ఇప్పటివరకు 5,334 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

**2026లో ఇప్పటివరకు సీజ్ చేసిన గంజాయి: 287 కిలోలు (19 కేసులు)**
**నిఘాలో ఉన్న పాత నేరస్థులు: 1,467 మంది**
**బైండోవర్ కేసులు నమోదు 7,012 మందిపై**

**ప్రజా సహకారంతోనే మత్తుకు చెక్!**

రైళ్లు, వాహనాల తనిఖీలతో పాటు కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లలో హంటర్ సేవలను విస్తృతంగా వినియోగిస్తామన్నారు.యువత, విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం కంట కనిపెట్టాలన్నారు.జిల్లాలో గంజాయి, డ్రగ్స్ సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు గానీ, 112, 1972 టోల్‌ఫ్రీ నంబర్లకు గానీ కాల్ చేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు కలిసొచ్చినప్పుడే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ సీహెచ్. చంద్రమౌళి, అడ్మిన్ ఆర్.ఐ మోలుద్దీన్, డాగ్ హ్యాండ్లర్లు, ఈగల్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## చెరుకుపల్లికి మరో అరుదైన గౌరవం

### స్వచ్ఛ ఆంధ్రా రాష్ట్ర స్థాయి అవార్డు దక్కించుకున్న అరుంబాక గ్రామ సంఘం



**బాపట్ల, అక్టోబర్03,ప్రభాతవార్త.ప్రతినిధి:** మండల పరిధిలోని అరుంబాక గ్రామ సంఘం గ్రామీణాభివృద్ధిలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది.పరిశుభ్రత,పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళా సాధికారతకు వేదికగా నిలుస్తూ స్వచ్ఛ ఆంధ్రా రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డును దక్కించుకుంది.ఇటీవలే అమరావతిలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా గ్రామ సంఘ ప్రతినిధులు ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడంతో మండలంలో పండగ వాతావరణం నెలకొంది.

**శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్**

రాష్ట్ర స్థాయిలో అవార్డు పొందిన సందర్భంగా అరుంబాక గ్రామ సంఘ అధ్యక్షురాలు దిరిసెల రామలక్ష్మి, చెరుకుపల్లి మండల సమాఖ్య అధ్యక్షురాలు కోట వాణిశ్రీ డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సింగయ్య తో కలిసి జిల్లా కలెక్టర్ ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అవార్డును, జ్ఞాపికను చూపిస్తూ కలెక్టర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామానికి ఇంతటి గొప్ప పేరు తెచ్చినందుకు అవార్డు గ్రహీతలను, మహిళా సంఘాల ప్రతినిధులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.ఆదర్శంగా కిచెన్ గార్డెన్స్అరుంబాక గ్రామం ఈ స్థాయి అవార్డును దక్కించు కోవడానికి గ్రామ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కిచెన్ గార్డెన్స్(ఇంటింటి దొడ్ల పెంపకం) కార్యక్రమమే ప్రధాన కారణమన్నారు. గ్రామంలో ప్రతి ఇంట్లోనూ, ఖాళీ స్థలాల్లోనూ పెద్ద ఎత్తున కూరగాయలు,ఆకుకూరలు సాగు చేస్తూ రసాయన రహిత ఆహారాన్ని అందిస్తున్నారు. గ్రామ సంఘం తీసుకున్న ఈ చొరవతో గ్రామం పచ్చదనంతో శోభిల్లుతూ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచిందని జిల్లా అధికారులు కొనియాడారు.రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడం పట్ల గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు,మండల సమాఖ్య నాయకులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని గ్రామ సంఘ ప్రతినిధులు తెలిపారు.

## రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**రేపల్లె, అక్టోబరు 3, ప్రభాతవార్త:** మండలంలోని వడ్డివారిపాలెం పంచాయతీ శివారు వాకావారిపాలెంలో విబిజిఆర్ఎఎంజి కింద రూ.20 లక్షలతో సిసి రహదారుల నిర్మాణానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు,రేపల్లె నియోజకవర్గ తెదేపా సీనియర్ నేత అనగాని శివప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు.అదే విధంగా గుడ్డికాయలంక గ్రామంలో రూ.42 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల అభివృద్ధి కోసం అవసరమైన నిధులను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి మంజూరు చేయిస్తున్నారని చెప్పారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు,తెలుగుదేశం పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## బాపట్ల రూరల్ నూతన సీఐగా ఎస్. సుబ్బారావు




**బాపట్ల, అక్టోబర్03,ప్రభాతవార్త.ప్రతినిధి:** బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఎస్. సుబ్బారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు సిబ్బంది పూలముక్కలతో ఘన స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం సీఐ మాట్లాడుతూరూరల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానన్నారు.బాధితులకు, సామాన్య ప్రజలకు పోలీస్ స్టేషన్ తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను కొనసాగిస్తూనే,శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, అందరి సహకారంతో నేరరహిత రూరల్ సర్కిల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు : జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు




వేమూరు అక్టోబరు 3 (ప్రభాతవార్త) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వేమూరు పోలీస్ స్టేషన్‌లో వేమూరు సర్కిల్ పరిధిలోని పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలను గురించి పలు సూచనలు చేశారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా తీసుకోవాల్సిన చర్యల గురించి సమీక్షించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా ఉండేందుకు అనేక కార్యక్రమాలను, అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించడం జరుగుతుంది అన్నారు. అదే విధంగా శిరోరక్ష ప్రాణ రక్ష కార్యక్రమం ద్వారా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు 11నుండి 12శాతం వరకు నివారించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రజలు కూడా పోలీసులకు సహకారాన్ని అందిస్తూ ప్రశాంత వాతావరణం నెలకొల్పే విధంగా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రేపల్లె డిఎస్పీ అబ్దుల్ అజీజ్, వేమూరు, చుండూరు సిఐలు, నజీబ్‌బాష ఎం.ఆనందరావు, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సూర్యలంక బాపట్ల మున్సిపాలిటీలో విలీనం కావడం వల్ల బాపట్లకు మహర్దశ



**బాపట్ల,అక్టోబర్3,ప్రభాతవార్త.ప్రతినిధి:** బాపట్ల శివారు గ్రామాల విలీనంపై వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో సూర్యలంక బాపట్ల మున్సిపాలిటీలో భాగం కావడం పట్ల బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు తిమ్మన శ్యామ్ సుందర్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ పిటిషన్‌దార్లతో స్థానిక శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ప్రత్యేకంగా చర్చించి,పిటిషన్లను ఉపసంహరించుకునేలా చేయడం అభినందనీయ మన్నారు.తరతరాలుగా సూర్యలంక తీరంతో బాపట్ల ప్రజలకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు.ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న ఈ తీరం,పట్టణం నుంచి వేరుపడిందనే భావన హైకోర్టు తీర్పుతో తొలగిపోయిందన్నారు.కేంద్ర నిధులతో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సూర్యలంక బీచ్ మున్సిపాలిటీ పరిధిలోకి రావడం వల్ల బాపట్ల బ్రాండ్ నేమ్ ప్రపంచవ్యాప్తమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అంతర్జాతీయ పర్యాటక రంగంలో బాపట్ల సుస్థిర స్థానం సంపాదించుకుంటుందన్నారు.తద్వారా సూర్యలంక బీచ్ ఇకపై బాపట్ల బీచ్‌గా మరింత ప్రసిద్ధి చెందుతుందన్నారు.గత 1400 సంవత్సరాలుగా విద్యా, సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లుతున్న బాపట్లకు ఇది ఒక సువర్ణావకాశమన్నారు.11 శివారు గ్రామాల విలీనానికి కృషి చేసి మున్సిపాలిటీ పరిధిని విస్తరించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మతో పాటు సహకరించిన ఆయా గ్రామాల ప్రజలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు.

## గ్రామాల్లోని అధికారులు, సిబ్బంది స్వచ్ఛభారత్ లక్ష్యాలను సాధించాలి : ఎంపీడీవో కృష్ణ నాయక్



**చెరుకుపల్లి ,అక్టోబర్ 3, ప్రభాతవార్త :** ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్ లక్ష్యాలను సమర్థవంతంగా సాధించాలని ఎంపీడీవో కృష్ణ నాయక్ అన్నారు. మండల కేంద్రమైన చెరుకుపల్లి ఎస్ డబ్ల్యు పిసి కేంద్రంలో శనివారం ఎక్స్పోజర్ విజిట్ మరియు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో తడి పొడి చెత్త వేరు చేయడం, వర్మీ కంపోస్ట్ తయారీ, బిన్ బ్యాగ్ సిస్టం, వ్యర్థాల సక్రమ నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై విశ్లేషణాత్మకంగా ఆయన అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలోని ఎస్ డబ్ల్యు పిసి కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పరిశుభ్రమైన స్వచ్ఛమైన గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు, గ్రీన్ గార్డ్స్, గ్రీన్ అంబాసిడర్లు, సీఆర్పీలు ,పారిశుధ్య సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

## 40 క్వింటాళ్లు పిడిఎస్ బియ్యం పోలీసుల స్వాధీనం



**బాపట్ల, అక్టోబర్3,ప్రభాతవార్త.ప్రతినిధి:** పిడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి వ్యాపారం చేస్తున్నారన్న ఆరోపణలపై కొల్లూరుకు చెందిన సామా సత్యనారాయణపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. జగనన్న కాలనీలో ఆయన అద్దెకు తీసుకున్న ఇంట్లో అధికారులు శుక్రవారం తెల్లవారుజామున ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా 80 ప్లాస్టిక్ మూటల్లో 4,000 కిలోల పిడీఎస్ బియ్యం గుర్తించారు. ఒక్కో మూటలో 50 కిలోల చొప్పున మొత్తం 40 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు అధికారులు తెలిపారు.సమాచారం మేరకు సివిల్ సప్లయిస్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఇంటిని తనిఖీ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సామా సత్యనారాయణ గతంలోనూ పిడీఎస్ బియ్యం అక్రమ నిల్వకు సంబంధించి కేసును ఎదుర్కొన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది జూలై 20న కొల్లూరు ఉప్పు బజారులోని ఆయన నివాసంలో 20 క్వింటాళ్ల పిడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో నిత్యావసర సరుకుల చట్టం కింద 6ఏ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.తాజాగా మరోసారి భారీగా పిడీఎస్ బియ్యం పట్టుబడటంతో సత్యనారాయణపై కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ తనిఖీలో సివిల్ సప్లయిస్ సిబ్బంది ఫణికుమార్, కొల్లూరు3 గ్రామ రెవెన్యూ అధికారి నన్నెపాముల రాంబాబు, మధ్యవర్తులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**రేపల్లె, అక్టోబరు 3, ప్రభాతవార్త:** అంగన్ వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని రేపల్లె ఐసిడిఎస్



ప్రాజెక్టు సిడిపివో ఎం.సుచిత్ర అన్నారు.ఈస్ట్ మహ్మదీయపాలెం, ఊరట్యాంక్ అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం అంగన్‌వాడీ ఉత్సవం,పోషణ మాసోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా సిడిపివో సుచిత్ర మాట్లాడుతూ గర్భిణీలు,బాలింతలు,చిన్నారులకు పౌష్టికాహారం అందజేయాలన్నారు.ఆరోగ్యం,పరిశుభ్రత,వ్యక్తిగత శుభ్రత,సమతుల్య ఆహారం ప్రాధాన్యతలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ హిమబిందు,పద్మావతి,వాణి,అంగన్‌వాడీ కార్యకర్తలు,తల్లులు,గర్భిణీలు,బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యత కలిగిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ



**నగరం, అక్టోబర్3 (ప్రభాతవార్త):** రెవిన్యూ సమస్యలను సరళీకృతం చేస్తూ భావితరాలకు భూ సమస్యలతో ఇబ్బంది లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని బాపట్ల సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట అన్నారు. శనివారం నగరం మండలంలోని బెల్లంవారి పాలెం గ్రామంలో రీ సర్వే పూర్తి చేసిన రాజ్యముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమికి సంబంధించిన సేవలన్నీ సరళీకృతం అయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే చేపట్టి క్షేత్ర స్థాయిలో భూవివాదాలు పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భూ సమస్యలతో ఇబ్బంది పడకుండా ఉండడానికి పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. గ్రామాలలో రెవెన్యూ సదస్సులతో ప్రజల నుంచి వచ్చిన రెండువేల రకాల సమస్యలతో వచ్చిన అర్జీలను అధ్యయనం చేసి పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు.

## ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవం



**నిజాంపట్నం, అక్టోబరు 3, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సేవలకు విలువ కట్టలేమని ఎంపిడిఓ నాగలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని పల్లపట్ల ఐసిడిఎస్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ ఉత్సవం, పోషణ మహా వేడుకల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు 5 సంవత్సరాలు వచ్చే వరకు తల్లితో సమానంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సేవలు చేస్తున్నారనా న్నరు.ఈ సందర్భంగా గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, ఊయల సేవ కార్యక్రమాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ అనసూయ, ఎంపిడిఓ కార్యాలయ ఎఓ లక్ష్మీకాంతమ్మ, కూచినపూడి పిహెచ్‌సి డాక్టర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, తల్లులు, గర్భిణీలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు పేకాట రాయుళ్లు అరెస్ట్

**చెరుకుపల్లి, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** మండలంలోని గుల్లపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కందుల కృష్ణ తిరుపతిరావు తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో గుళ్ళపల్లి ఈ ఊరి సుబ్బారావు రైస్ మిల్ వెనుక పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను వారి వద్ద నుండి 11,420 రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్న ట్లు ఆయన తెలిపారు. మండలంలో మరి ఎక్కడైనా పేకాట, కోడిపందాలు వంటి జూదపు క్రీడలు నిర్వహిస్తే వెంటనే సమాచారం అందించాలని అటువంటి వారి పట్ల చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి:ఎస్ఐ అమీర్



**రేపల్లె, అక్టోబరు 3, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణ రక్షణ పొందాలని భట్టి ప్రోలు ఎస్ఐ కె.అమీర్ అన్నారు.శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల ప్రకారం భట్టి ప్రోలు పెదమాలపల్లిలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.శిరోరక్ష ప్రాణ రక్ష అంశంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు.హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే రూ.1000 జరిమానా విధిస్తామని చెప్పారు.మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో గొడవలు చేసేవారిపై రౌడీషీట్ నమోదు చేస్తామని తెలిపారు.ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.గంజాయి సమాచారాన్ని తమ దృష్టికి తీసుకురావాలని,సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అమీర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# త్రిపురనేని రామస్వామి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**- విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టరలావు రత్తయ్య - ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలి - పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు**

**చేబ్రోలు(పొన్నూరు), అక్టోబర్ 3,ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ప్రముఖ సంఘ సంస్కర్త, హేతువాది, రచయిత కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి స్మరణ సభను ఘనంగా నిర్వహించారు. తెనాలి మునిసిపల్ ఛైర్మన్‌గా త్రిపురనేని



రామస్వామి చౌదరి ఎన్నికై 100సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అంగలూరు నుంచి తెనాలి వరకు నిర్వహిస్తున్న చైతన్య యాత్రలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ త్రిపురనేని రామస్వామి చౌదరి తన ఆలోచనలు, రచనల ద్వారా సమాజంలో తర్కబద్ధమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, విషయాలను తర్కబద్ధంగా ఆలోచించి అర్థం చేసుకోవాలని నూరిపోశారని తెలిపారు. సుమారు 100సంవత్సరాల క్రితమే జ్ఞానం ద్వారా సాధికారత సాధ్యమవుతుందని త్రిపురనేని రామస్వామి చౌదరి గుర్తించారని చెప్పారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు తనపై కూడా ప్రభావం చూపాయన్నారు. త్రిపురనేని రామస్వామి స్ఫూర్తితోనే విజ్ఞాన్స్ విద్యాసంస్థల్లో చదువుతున్న సుమారు 25వేల మంది విద్యార్థులను సరైన దిశలో నడిపించేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. మరో అతిథి విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ జీవితంలో ప్రతి విషయాన్ని ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలని అన్నారు. ఎలా జీవించాలి, జ్ఞానాన్ని ఎలా సంపాదించాలి అనే విషయాలపై యువత ఆలోచించాలని సూచించారు. గొప్పగా ఆలోచించడంతో పాటు ఆ ఆలోచనలను ఆచరణలో పెట్టి గొప్ప పనులు చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. మరో అతిథి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి ఆలోచనలు, రచనలు తెలుగు సమాజంలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించాయన్నారు. మూఢనమ్మకాలు, సామాజిక అసమానతలు, దురాచారాలను ప్రశ్నిస్తూ హేతుబద్ధమైన ఆలోచనా విధానాన్ని ప్రజల్లో పెంపొందించేందుకు ఆయన చేసిన కృషిని స్మరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది చైతన్య యాత్రకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, ప్రముఖ సినీ నటుడు త్రిపురనేని సాయిచంద్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

**163 మంది కిట్స్ విద్యార్థులకు ఉద్యోగాలు. - కిట్స్ కళాశాల చైర్మన్ డాక్టర్ సుబ్బారావు**

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), అక్టోబర్ 3, ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు లభిస్తాయని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంజనీరింగ్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కోయి



సుబ్బారావు పేర్కొన్నారు.

మండలంలోని వింజనంపాడు గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు చెన్నైకి చెందిన ప్రముఖ బహుళజాతి సంస్థ టీవీఎస్ లూకాస్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో విశేష ప్రతిభ కనబరిచి163 మంది ఉద్యోగాలు సాధించిన సందర్భంగా అభినందన సభను శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు హాజరై మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలు పెంపొందించు కోవడం వల్లే ప్రతిష్టాత్మక టీవీఎస్ సంస్థలో తమ కళాశాలకు చెందిన 163 మంది విద్యార్థినివిద్యార్థులు ఉద్యోగాలు సాధించారని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, పలువురికి ఆదర్శంగా నిలవాలని కోరారు. ఆఖరి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు

ఏడాదికి రూ. మూడు లక్షల వార్షిక వేతన ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించడం చాలా గర్వంగా ఉందన్నారు. అకడమిక్ పరంగా విద్యార్థులకు మంచి విద్య అవసరమని, అలాగే తాను చదువుకున్న అంశంపై వృత్తి నైపుణ్యం కూడా చాలా ప్రాముఖ్యమని వివరించారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు సాంకేతికంగా కూడా పరిజ్ఞానం కలిగిఉంటే ఉపాధికి కొదవలేదని అభిప్రాయపడ్డారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడాలనే ఉద్దేశంతో కళాశాలలో నిపుణులైన అధ్యాపకులచే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కళాశాల కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ..పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించడమే కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ప్రాథమిక ధ్యేయమన్నారు. ఈ విజయం కళాశాలలో నాణ్యమైన విద్యకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు మాట్లాడుతూ..తొలి ప్రయత్నంలోనే భారీసంఖ్యలో విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. విద్యార్థులు తమ వృత్తిపరమైన జీవితంలో ఉత్తమ ప్రతిభ చూపటానికి తర్ఫీదునిచ్చిన కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్లేస్‌మెంట్ అధికారి సిహెచ్. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..

కళాశాలలో అందించిన ప్రత్యేక ప్లేస్‌మెంట్ శిక్షణ, కోడింగ్, ఆప్టిట్యూడ్ మరియు సాఫ్ట్ స్కిల్స్ తరగతులే విద్యార్థుల విజయానికి ప్రధాన కారణమని వివరించారు. కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక , ప్లేస్‌మెంట్ విభాగ ప్రతినిధులు, ఎంపికైన విద్యార్థిని విద్యార్థులు పాల్గొని సంతోషాన్ని వ్యక్తపరిచారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో వైకాపా సత్తా చాటాలి

**వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు**

పొన్నూరు, అక్టోబర్ 3,ప్రభాతవార్త: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ తమ సత్తాను చాటుకోవాలని, అందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆ పార్టీ జిల్లా



అధ్యక్షుడు అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. ఇటీవల నూతంగా పదవులు పొందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా పలువురు నాయకులను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు వారితో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను ఒక చాలెంజ్‌గా తీసుకుని గెలుపే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలన అందించడంలో పూర్తిగా విఫమైందన్నారు. వారి వైఫల్యాలలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో ఎ నిచేయాలన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేక పోయిందన్నారు. కూటమి నాయకులు, ప్రభుత్వం చేతిలో రాష్ట్ర ప్రజలు మోసపోయారని, ఆ విషయాన్ని ప్రజలందరూ గుర్తించారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కూటమి పార్టీకి ఓటు ద్వారా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక సవాల్‌గా తీసుకొని గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. వైకాపా పట్టణ ఉపాధ్యక్షురాలు అన్నవరపు శ్యామల, జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి మంచాల కృష్ణబాబు, జిల్లా రైతు విభాగం ఎగ్జిక్యూటీవ్ సభ్యుడు దూళ్ళ జంగమయ్య, జిల్లా మహిళా విభాగం ఎగ్జిక్యూటీవ్ సభ్యురాలు వాసిమళ్ళ సరళ, రుద్రపాటి మేరీ రత్నంలు నాయకులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరితోపాటు వైకాపా రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ సభ్యురాలు, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డక్కుమళ్ళ రవి నాయకులను కలిసినవారిలో ఉన్నారు. అదేవిధంగా మాజీ ఎంపీలు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి, మోదుగల వేణుగోపాల్‌రెడ్డి, సమన్వయకర్త అంబటి మురళీకృష్ణలను మర్యాదపూర్వకంగా కలిశారు.

# గర్భిణీ స్త్రీలు వైద్యుల సలహాలు తీసుకోవాలి

**-స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎన్.హిమబిందు**



**పొన్నూరు, అక్టోబర్ 3,ప్రభాతవార్త:** గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా వైద్యుల సలహాలను తీసుకోవడంతోపాటు వాటిని పాటించాలని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎన్.హిమబిందు సూచించారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం రోటరీ మెటర్నల్, చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా డాక్టర్ హిమబిందు పలు సలహాలు, సూచనలు చేశారు. గర్భిణీస్త్రీలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. వైద్యుల సలహ మేరకు ముందులు వాడాలన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు పండ్లు, పలకలు, కూర్చోవడానికి చాపలు, కూలింగ్ వాటర్ క్యాన్లు అంజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి నన్నపనేని బాలకృష్ణ, రోటరీ నాయకులు రావిపాటి మోహనరావు, రాజేంద్ర చౌదరి, సాదు ప్రసాద్, నితిన్, కారుమూరి శ్రీనివాస్, కొత్తమాసు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమ మేధస్సుతో రోబోటిక్స్‌లో సరికొత్త ఆవిష్కరణలకు నాంది

**-రోబో మ్యాట్రిక్స్ సీఈఓ, వ్యవస్థాపకుడు డాక్టర్ గణేష్**

**పొన్నూరు, అక్టోబర్ 3,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ విభాగం, ఆఫీస్ ఆఫ్ ఇండస్ట్రీ రిలేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నెక్ట్స్-జెన్ రోబోటిక్స్ ఇంటిగ్రేటింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఎ స్మార్టర్ ఫ్యూచర్ అనే అంశంపై శనివారం వన్‌డే సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన రోబో మ్యాట్రిక్స్ సీఈఓ, వ్యవస్థాపకుడు డాక్టర్ గణేష్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ రెండూ వేర్వేరు సాంకేతిక రంగాలైనప్పటికీ, వాటిని సమర్థవంతంగా అనుసంధానించడం ద్వారా నెక్ట్స్-జెన్ రోబోటిక్స్‌కు మరింత విస్తృత అవకాశాలు ఏర్పడతాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో సమర్థవంతమైన ప్రాంప్ట్‌లను రూపొందించడం, ఏఐని సరైన విధంగా ఉపయోగించుకోవడం వంటి నైపుణ్యాలను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. ప్రతి విద్యార్థి పెద్ద లక్ష్యాలపై దృష్టి పెట్టడంతో పాటు చిన్న చిన్న ప్రోటోటైపులు, ప్రాజెక్టులతో ప్రారంభించి ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం అటానమస్ మొబైల్ రోబోట్స్ ద్వారా తయారీ, లాజిస్టిక్స్, తనిఖీ, మెటీరియల్ హ్యాండ్లింగ్ రంగాల్లో చోటుచేసుకుంటున్న మార్పులను వివరించారు. మరో అతిథి ఐఐటీ శ్రీ సిటీలో విజిటింగ్ ఫ్యాకల్టీ డాక్టర్ శక్తి స్వరూప్ మాట్లాడుతూ కళాశాల విద్య అనంతరం విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్ళను దృష్టిలో ఉంచుకుని తమ ఆలోచనలను ఆచరణాత్మక భావనలుగా మార్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. స్వయం ప్రనతిపత్తి నిర్ణయాలు తీసుకునే వ్యవస్థలు, అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం, సరైన నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి వర్చువల్‌గా హాజరైన అమెరికాలోని ఒహియోకు చెందిన బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ అబూహాఫెజ్ మెషిన్ లెర్నింగ్‌ను ఉపయోగించి స్వయం ప్రతిపత్తి వ్యవస్థల్లో మోడల్ ఫ్రీ కంట్రోల్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మెషిన్ లెర్నింగ్ ఆధారిత నియంత్రణ వ్యవస్థలు స్వయం ప్రతిపత్తి సాంకేతికతల్లో పోషిస్తున్న పాత్రను వివరించారు. సెమినార్‌లో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీ, పోస్టర్ ప్రజెంటేషన్లు, ప్రాజెక్టు ఎక్స్‌పో పోటీలలో రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, మెకానికల్, ఈసీఈ విభాగాలకు చెందిన 84టీములు, 270మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనపబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెనాలి మున్సిపాలిటీకి రాష్ట్రప్రభుత్వ స్వచ్ఛతా అవార్డు

**తెనాలి మున్సిపాలిటీ, అక్టోబర్3,(ప్రభాతవార్త):** శ్రమకు ప్రతిఫలం దక్కిన వేళ,స్వచ్ఛతకు సత్కారం జరిగిన వేళ,తెనాలి మున్సిపాలిటీ ఖ్యాతిరాష్ట్రస్థాయిలో మరోసారి వెలుగొందిన వేళ"స్వచ్ఛత అవార్డు-2026"




మన తెనాలి మున్సిపాలిటీని వరించింది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగాఈ ప్రతిష్ఠాత్మక అవార్డునుమున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు అందుకోవడంతెనాలి మున్సిపాలిటీకి, ప్రతి పారిశుధ్య సిబ్బందికిగర్వకారణమైన, మరపురాని ఘట్టం.ఈ విజయానికి వెనుకపారిశుధ్య సిబ్బందిపై నమ్మకం ఉంచి,క్రింది స్థాయి శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు పూర్తి స్వేచ్ఛనిస్తూ,వారి ప్రతిభను వెలికితీస్తూ,ప్రతి కార్యక్రమాన్ని స్వయంగా క్లోజ్ మానిటరింగ్ చేస్తూ,అవసరమైన డాక్యుమెంటేషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ,ప్రతి అంశాన్ని సమర్థవంతంగా ఫాలోఅప్ చేసిన మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు నాయకత్వం ఎంతో కీలకం."అధికారంతో కాదుఅవకాశంతో పని చేయించాలి" అనే ఆలోచనతోసిబ్బందికి బాధ్యతను, స్వేచ్ఛను అందించి"మన తెనాలి - మన బాధ్యత" అనే స్ఫూర్తిని నింపినప్రతి ఒక్కరి కృషికి ఈ అవార్డు ప్రతిబింబం.ప్రతి పారిశుధ్య కార్మికుడి చెమట బొట్టులో,ప్రతి శానిటేషన్ సెక్రటరీ కృషిలో,ప్రతి డాక్యుమెంట్‌లో,ప్రతి స్థాయి మానిటరింగ్‌లో,ప్రతి అధికారి,సిబ్బంది సమన్వయంలో,ఈ స్వచ్ఛత అవార్డు-2026 విజయగాథ దాగి ఉంది.

**తెనాలి మున్సిపాలిటీకి ఇది కేవలం ఒక అవార్డు కాదు..మన సమిష్టి కృషికి లభించిన గౌరవం.**

మన పట్టుదలకు లభించిన గుర్తింపు.మన తెనాలి స్వచ్ఛతకు లభించిన కీర్తి కిరీటం.రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్నమున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు కి హృదయపూర్వక అభినందనలు తెలుపుకుంటూ,అలాగే ఈ విజయానికి అహర్నిశలు కృషి చేసినశానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు,పారిశుధ్య సిబ్బంది, అధికారులు మరియు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలుపుకుంటూ"స్వచ్ఛతలో తెనాలి,సేవలో తెనాలి,సాధనలో తెనాలి,సత్కారంలో తెనాలి.

# అంగలకుదురు శ్రీవాసుదాస పీఠంలో శ్రీలక్ష్మీ అమ్మవారికి విశేషపూజలు

**తెనాలి అక్టోబర్3(ప్రభాతవార్త):** తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలోని ఆంధ్ర వాల్మీకి శ్రీ వాసుదాస స్వామి వారి పీఠంలో 75 సంవత్సరాల క్రితం శ్రీ దాసశేష స్వామి వారిచే ప్రారంభింప బడిన ఈ మహాలక్ష్మీ అమ్మవారి కుంకుమ పూజలు షష్టమ పీఠాధిపతి శ్రీ సీతారామదాసు స్వామి వారి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19వ తారీకు నుంచి అక్టోబర్ 4వ తారీఖు వరకు విశేషంగా జరుగుతున్నాయి.శని, ఆదివారాల్లో శ్రీ లక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు జరిగినవి మరియు మైసూర్ దత్తపీఠం శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి , బాలస్వామి వారి ఆశీర్వాద తోను వారి శిష్యబృందము సుమారు 20 మంది రిత్వికులు ద్వాదశ మంత్ర దత్త హోమము నిన్న ఈరోజు ఎంతో విశేషంగా జరిగినవి .వారి ముఖ్య శిష్యులు బుర్ర భాస్కర్ దత్తు ఆధ్వర్యంలో ఎంతో విశేషంగా జరుగుచున్నవి. రేపు పూర్ణాహుతి మరియు శ్రీ మహాలక్ష్మి అమ్మవారి విశేష అభిషేకము, అలంకారము పూర్ణాహుతి జరుగును. కావున భక్తులు విశేషంగా పాల్గొని తిలకించి అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సింది.భక్తుల కోర్కెలు తీర్చే రాముడుగా మంచి ప్రసిద్ధమైనది. అనేకమందికి వివాహము జరిగినవి . ఉద్యోగములు వచ్చినవి. అనేక సమస్యలు కూడా తీరినవి.6వ పీఠాధిపతి శ్రీ సీతారామ



స్వామి వారి ఆధ్వర్యంలో ఎంతో విశేషంగా జరుగు చున్నది. భక్తుల సౌకర్యార్థము హాలు వేసినారు .ఇంకను నిర్మాణ పనులు ఉన్నాయి. ఆసక్తిగల భక్తులు ధన రూపంలో గానీ వస్తు రూపంలో గానీ ,సహాయ సహకారం అందించగలరు. ఆరవ పీఠాధిపతి సీతారామదాసు స్వామి సంప్రదించగలరు.

# ఆవిష్కరణలకు డీఎస్ఐఆర్-ప్రిజం ప్రోత్సాహం

**కేఎల్ యూనివర్సిటీలో అవగాహన కార్యక్రమం**

**తాడేపల్లి, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** వినూత్న ఆలోచనలను ఉత్పత్తులుగా, అంకుర సంస్థలుగా అభివృద్ధి చేసేందుకు డీఎస్ఐఆర్-ప్రమోటింగ్ ఇన్నోవేషన్స్ ఇన్ ఇండివిజ్యువల్స్ స్టార్టప్స్ అండ్ ఎంఎసం ఎంఇలు (ప్రిజం) పథకం ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను ఔత్సాహికులు వినియోగించుకోవాలని వక్తలు సూచించారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో శనివారం ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తల ప్రోత్సాహంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏసీఐసీ-కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్ మరియ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐఐఈ) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. సీఐఐఈ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ వి. రాజేష్, ఏసీఐసీ-కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్ సీఈఓ రమణ్ కాంత్ వల్లభనేని ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉన్న అవకాశాలను వివరించారు. విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.పవన్‌కుమార్, వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ, ఫ్యాబ్ ల్యాబ్స్ డైరెక్టర్ డాక్టర్ గౌరవ్ కపూర్ పాల్గొన్నారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (ఎస్పీఎంవీవీ) బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి. జోష్నా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, అంకుర సంస్థల స్థాపనలో ఆవిష్కరణల ప్రాధాన్యాన్ని వివరించారు.



డీఎస్ఐఆర్-ప్రిజం పథకం కింద లభించే ఆర్థిక సహకారం, ఇతర ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించారు. ప్రిజం పథకం, ఆవిష్కరణ దశను బట్టి (ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ నుండి ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ వరకు), ఆవిష్కర్తలకు రు.2 లక్షల నుండి రు.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తుంది. డీఎస్ఐఆర్-టెప్ అవుట్‌రీచ్ కమ్ క్లస్టర్ ఇన్నోవేషన్ సెంటర్ (టీఓసీఐసీ), ఎస్పీఎంవీవీ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమం లో కెఎల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎన్. వెంకట్ రామ్, డాక్టర్ కె. రాజశేఖర రావు,రిజిస్ట్రార్ డాక్టర్ కె. పవన్ కుమార్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్. ప్రసాద్, సీఐఐఈ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ వి. రాజేష్, ఏసీఐసీ-కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్ సీఈఓ రమణ్ కాంత్ వల్లభనేని, విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, విశ్వవిద్యాలయ ఇంక్యుబేషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

# అవోపా ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**గుంటూరు విద్య, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** గుంటూరు స్థానిక అరండల్ పేట లోని అవోపా కార్యాలయం నందు శుక్రవారం అవోపా అధ్యక్షులు కే.వీ. బ్రహ్మం ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ మరియు లాల్ బహదూర్ శాస్త్రిజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అధ్యక్షులు కే.వీ. బ్రహ్మం మాట్లాడుతూ ప్రపంచానికి సత్యం, అహింస అనే రెండు బలమైన ఆయుధాలను పరిచయం చేసిన మహనీయుడు మహాత్మా గాంధీ అని అన్నారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కేవలం అహింసా మార్గంలో నడచి, ఎదిరించి మన దేశానికి స్వాతంత్రము తెచ్చిపెట్టడంలో ముందంజలోఉండి మహాత్ముడయ్యాడని అన్నారు. మరో గొప్ప నాయకుడు, మహనీయుడు లాల్ బహదూర్ శాస్త్రిని



గూర్చి మాట్లాడుతూ జై జవాన్, జై కిసాన్ అనే నినాదంతో దేశ సరిహద్దులను కాపాడుతున్న సైనికుని పాత్ర ఎంత ముఖ్యమో, దేశ ప్రజలకు ఆహారం అందించడానికి రేయింబవళ్లు కష్టపడుతున్న రైతు పాత్ర కూడా అంతే ముఖ్యము అని అన్న గొప్ప మేధావి లాల్ బహదూర్ శాస్త్రిఅని అన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి శ్రీనివాసరావు, శివాజీ, గోపాల్ రావు, రామారావు, శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# షటిల్,బాడ్మింటన్ పోటీల్లో చిప్స్ విద్యార్థినుల ప్రతిభ

**గుంటూరు విద్య,అక్టోబర్ 3, ప్రభాతవార్త :** చేబ్రోలు హనుమయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (చిప్స్) కళాశాల విద్యార్థినులు క్రీడల్లో తమ సత్తా చాటారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో



బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల మహిళల షటిల్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో చిప్స్ కళాశాల మహిళా జట్టు ఘన విజయం సాధించింది. ఈ టోర్నమెంట్‌లో నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని మొత్తం 15 కళాశాలల జట్లు పాల్గొనగా, చిప్స్ విద్యార్థినుల టీమ్ ప్రతి రౌండ్‌లోనూ అద్భుతమైన ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో తృతీయ (3వ) స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన చిప్స్ కళాశాల విద్యార్థినులు ఎన్. మేఘన చౌదరి, పి. హేమ నాగ హర్షిత లు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విద్యాధర హర్షం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ స్థాయిలో మూడో స్థానం సాధించడంతో పాటు సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను కళాశాల ప్రెసిడెంట్ డా. ఆర్. శ్రీనివాసు , ట్రెజరర్ ఆర్. గోపాలకృష్ణ , సెక్రటరీ డాక్టర్ సి.ఎన్. శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విద్యాధర, అధ్యాపక బృందం మరియు సిబ్బంది ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# కిట్స్ అక్షర్‌లో ముగిసిన బూట్ క్యాంపు

**ప్రత్తిపాడు, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** మండలంలోని ఎనమదల గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ అక్షర్ ఇంజనీరింగ్ కళాశాలలో గతవారం రోజుల నుండి నిర్వహిస్తున్న ఐఓటీ బూట్‌క్యాంప్, ఐడియాథాన్ హ్యాకథాన్ విజయవంతంగా ముసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కల్లూరి రామకోటయ్య శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు హాజరై మాట్లాడుతూ..కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, సిఎస్ఐ స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో టెక్నా ఫ్యూచర్ ఇండియా సహకారంతో గత నెల 28 నుండి అక్టోబర్ 3వ తేదీ వరకు నిర్వహించిన బూట్‌క్యాంప్, ఐడియాథాన్ హ్యాకథాన్ ఆన్ ఐఓటీ కార్యక్రమం ఘనంగా నిర్వహించామని చెప్పారు. ఆరు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో బిటెక్ సిఎస్ఈ మూడవ సంవత్సర విద్యార్థులు ఐఓటి సెన్సార్లు, ఆర్డుయినో, ఈఎస్పీ 32, క్లౌడ్ కనెక్టివిటీ, రియల్‌టైమ్ డేటా మానిటరింగ్ వంటి అంశాలపై ప్రత్యక్ష శిక్షణ పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహించిన ఐడియాథాన్లో విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలను ప్రదర్శించగా, హ్యాకథాన్ లో స్మార్ట్ హోమ్, స్మార్ట్ అగ్రికల్చర్, హెల్త్ మానిటరింగ్, వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి సమస్యలకు



ఐఓటి ఆధారిత ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించినట్లు వెల్లడించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులలో ఆవిష్కరణాత్మక ఆలోచనలు, బృందస్ఫూర్తి, పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందుతాయన్నారు. సాంకేతిక రంగంలో పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఎదగడానికి ఇలాంటి హ్యాకథాన్లు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమ ముగింపు సందర్భంగా ఉత్తమ ప్రాజెక్టులను ఎంపికచేసి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కోయ శేఖర్, డైరెక్టర్ గోగినేని సాంబశివరావు, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ జి. గురు కేశవదాసు, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నేషనల్ హైవే పై ప్రమాదకర ఫ్లెక్సీలను తొలగించండి!

**నితిన్ గడ్కరీకి మాదాసు భాను ప్రసాద్ లేఖ**

**చిలకలూరిపేట,అక్టోబర్ 3, ప్రభాతవార్త :** చిలకలూరిపేట జాతీయ రహదారిపై ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న అక్రమ ఫ్లెక్సీలను తక్షణమే తొలగించి, శాశ్వత నియంత్రణ చర్యలు చేపట్టాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సామాజికవేత్త, మాదాసు భాను ప్రసాద్ లేఖ రాశారు. ఆగస్టు 27న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయిన తరువాత కూడా రోడ్డు ప్రమాదాల కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారని కనుక రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అధికారులు కంటి తడుపు చర్యలతో పరిష్కారాలు కావని పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కూడళ్లు, మలుపులు, కార్నర్ ప్రాంతాల్లోని భారీ ఫ్లెక్సీలు వాహనదారుల



దృష్టికి ఆటంకంగా మారుతున్నాయని తెలిపారు.నెల రోజుల క్రితం అధికారులు హైవేను పరిశీలించినప్పటికీ, ఇప్పటివరకు ప్రమాదకర ఫ్లెక్సీలపై తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. నేషనల్ హైవే దూర సూచిక బోర్డులపైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన విషయాన్ని తాను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను నియంత్రించి, భవిష్యత్తులో పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వీధి దీపాలు వెలగడం లేదని, స్పీడ్ బ్రేకర్స్ పై జీబ్రా గీతలు, రోడ్ మార్కింగ్స్, హెచ్చరిక బోర్డులు, ఏర్పాటు చేయాలని కోరారు. చిలకలూరిపేట జాతీయ రహదారిపై భద్రతా పరిస్థితులను పునఃసమీక్షించి, తక్షణ చర్యలు తీసుకునేలా ఆదేశించాలని నితిన్ గడ్కరీని కోరారు. ఈ కార్యక్రమంలో కందా భాస్కర్, హరి ప్రసాద్, అడప రవి, మరుకొండ వెంకటరావు, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మానసిక అనారోగ్యం పై ఉన్న అపోహలు తొలగించాలి

**ప్రత్తిపాడు, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** మానసిక అనారోగ్యంపై ఉన్న అపోహలు, వివక్షను తొలగించి బాధితులతో గౌరవంగా మెలగాలని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ మోనిక ఆరోగ్య సిబ్బందికి సూచించారు. గుంటూరు, బృందావన్ గార్డెన్ ప్రాంతంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో శనివారం మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా



స్టాఫ్ నర్స్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నోడల్ ఆఫీసర్ డాక్టర్ మోనిక హాజరై మాట్లాడుతూ..మానసిక ఆరోగ్యం మంచి సమాజానికి సోపానం అన్నారు. ప్రజలు తమ శక్తిసామర్థ్యాలను గుర్తెరిగి సమస్యలను పరిష్కరించుకుంటూ ఉత్పాదకతతో భాగస్వాములవ్వడమే మానసికంగా మంచి ఆరోగ్యంగా ఉన్నట్లని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మానసిక ఆరోగ్యం పట్ల సరైన అవగాహన కల్పించే లక్ష్యంతో డబ్ల్యూహెచ్ఓ ప్రతి ఏడాది అక్టోబర్ 10వ తేదీన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తుందని చెప్పారు. జాతీయ మానసిక ఆరోగ్య సర్వే 2016 ప్రకారం భారతదేశంలో 13 నుండి 17 ఏళ్ల బాలల్లో 7.3 మానసిక ఆందోళన, ఒత్తిడి, మాదక ద్రవ్యాల వినియోగం, ఆత్మహత్య ఆలోచనలు వంటి సమస్యలతో బాధపడుతున్నారని వెల్లడించారు. మధ్య వయస్కులు, పట్టణాల్లో నివసించేవారు, చదువు లేని వారు, అల్పాదాయ వర్గాల్లో మానసిక సమస్యలు అధికంగా ఉన్నట్లు నిగ్గుతేలిందని వివరించారు. మానసిక సమస్యలు ఉన్నట్లు బయటికి చెబితే సమాజం చులకనగా చూస్తుందన్న భయంతో ఈ లక్షణాలను చెప్పుకునేందుకు, వైద్య సహాయం పొందడానికి చాలామంది జంకుతున్నారని తెలియజేశారు. భారత దేశంలో బలంగా పాతుకుపోయిన మూఢనమ్మకాలు సైతం ఎన్నో వర్గాల ప్రజలను ఆధునిక మానసిక చికిత్స వైపు వెళ్లకుండా చేస్తున్నాయని ఆందోళన చెందారు. ఆధునిక సమాచార ప్రసార యుగంలో సామాజిక మాధ్యమాలు సైతం ప్రజల మానసిక ఆరోగ్యాన్ని హరించివేయడంలో భాగస్వాములవ్వడం తుస్సుయని, కొందరు వ్యక్తులు పనిగట్టుకుని అవాస్తవాలను, ఉద్రిక్తతలు తలెత్తే సమాచారాలను పోస్ట్ చేస్తూ సమాజంలో ఆందోళన రేపుతున్నారని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని రక్షించుకునే సమాచారం సైతం అపారంగా అందుబాటులో ఉందని దాన్ని వినియోగించుకోవడం చాలా అవసరమన్నారు. స్మార్ట్ ఫోన్ లకు అలవాటు పడుతున్న చిన్నారులు, యువకులు నిద్రలేమితో సతమతమవుతూ, చదువు, కుటుంబ సభ్యులకు తగిన సమయాన్ని వెచ్చించక పోవడం, వ్యాయామం లేకపోవడం వంటి కారణాలతో మానసిక ఆరోగ్యాన్ని కోల్పోతున్నారని వెల్లడించారు. ఇలాంటి పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం, బాధితులకు ప్రాథమిక మానసిక సహాయం అందించడం, అవసరమైన సందర్భాల్లో నిపుణుల వద్దకు రిఫర్ చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ, మరియు పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు అత్యంత చేరువగా పనిచేసే ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మానసిక ఆరోగ్య సమస్యల గుర్తింపులో కీలకపాత్ర పోషించాలని కోరారు. మానసిక అనారోగ్యంపై ఉన్న అపోహలు, వివక్షను తొలగించి బాధితులతో గౌరవంగా, మర్యాదగా మెలగాలని తెలియజేశారు. మానసిక ఆరోగ్యం ప్రతిజ్ఞకృత వాక్యం-సమస్య వచ్చినవాళ్ళు సహాయం కోరడం బలహీనత కాదనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మన్నం గోపాలరావు, క్లినికల్ సైకాలజిస్ట్ బాల సాయికుమార్, ఎంపీహెచ్ఈఓ శేషగిరిరాజు, స్టాఫ్ నర్స్ శ్రావణి, ఏఎన్ఎంలు, ఇతర స్టాఫ్ నర్సులు, ఆశా కార్యకర్తలు, తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా గ్రామాలను అభివృద్ధి పరుచుకోవాలి : ఎంపీడీఓ విజయలక్ష్మీ



**కొల్లిపర, అక్టోబరు 3 ప్రభాతవార్త:** ప్రణాళికాబద్ధంగా గ్రామాలను అభివృద్ధి పరుచుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మీ అన్నారు. శనివారం మండల పరిధిలోని చక్రాయపాలెంలో పారిశుద్ధ్య పనులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో ప్రొక్లెయిన్ ద్వారా..పంచాయతీ కార్మికుల చేత అధికారులు మురుగునీటి తొలగింపు చర్యలు చేపట్టి కార్యదర్శులకు పంచాయతీ సిబ్బందికి సూచనలు..సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని...గ్రామాల్లో చెత్తా చెదారం లేకుండా చూచుకోవాలన్నారు. దోమల మందును పిచికారీ చేయించాలని చెప్పారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకుల ద్వారా ప్రజలకు మంచినీటి సరఫరా చేయాలన్నారు. కార్యదర్శులు కూడా త్రాగునీరు. కాల్వల్లో ఉన్న మురుగునీటిని తొలగించి బ్లీచింగ్ చల్లించాలన్నారు. పారిశుద్ధ్యం..రహదారులు..విద్య..ఆరోగ్యం వ్యవసాయం. యువజన అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీఓలు భారగవ్, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

# ధీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలి : మండల వైద్యాధికారి నీహా



**కొల్లిపర, అక్టోబరు 3 ప్రభాతవార్త:** దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి నీహ అన్నారు. శనివారం మండల పరిధిలోని దావులూరులో సంచార చికిత్స కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు గర్భిణీస్త్రీలకు ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా నీహ మాట్లాడుతూ గర్భిణీలు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు కూడా వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకోవాలన్నారు..గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. ప్రతి నెలా నిర్వహించు ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్నవారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్య సదుపాయం కల్పించనున్నట్లు తెలియజేసారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నాగరాజు, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పొదుపు ఎక్కువ చేసుకోండి అధిక రుణాలు పొందండి : ఏపిఎం రమాదేవి



**కొల్లిపర, అక్టోబరు 3 ప్రభాతవార్త:** బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను నిర్ణీత వ్యవధిలో చెల్లించాలని డిఆర్‌డిఏ ఏపిఎం రమాదేవి అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపర స్త్రీశక్తి భవనంలో పొదుపు సంఘాల సభ్యులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించి..రికార్డులు పరిశీలించి..రుణాలపై తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు పొదుపు ఎక్కువగా చేసుకుంటే అధికంగా రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. బ్యాంకు నుండి తీసుకున్న రుణాలను అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. నెల..నెలా డ్వాక్రా మహిళలు సమావేశం ఏర్పాటు చేసుకోవటం మంచిదన్నారు. సమావేశంలో సీసీలు బుజ్జిబాబు, విజయకుమార్, ప్రమీలాదేవి, టి.మధు, ఎమ్ ఎస్ ఏ సీతామహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# 34 శాతం బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టు తీర్పును ఖండించిన బీసీవై పార్టీ

**మంగళగిరి, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** 34శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు బీసీవై పార్టీ తీవ్ర ఖండిస్తుందని బిసివై పార్టీ నేతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 రిజర్వేషన్లకు



సంబంధించిన పిటీషన్లను హై కోర్టు కొట్టివేయడం, కూటమి ప్రభుత్వం కుట్రగా మేము భావిస్తున్నామన్నారు. బీసీల హక్కులకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని బీసీవై పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన సమయంలో, రిజర్వేషన్ల విషయంలో నెలకొన్న ఈ పరిణామాలను బీసీవై పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు

**బీసీల హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదు.**

బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడేందుకు బీసీవై పార్టీ నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ అంశంపై బీసీవై పార్టీ తన పూర్తి వ్యతిరేకతను తెలియజేస్తూ, బీసీలకు న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో త్వరలోనే పోరాటం చేయబోతున్నామని ప్రకటించారు. ఈ విషయంపై తదుపరి పోరాట కార్యాచరణను బిసివై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ అతి త్వరలో ప్రకటించనున్నారు. బీసీల హక్కుల కోసం బీసీవై పార్టీ పోరాటం కొనసాగుతుందన్నారు.

**బీసీవై పార్టీ రాష్ట్ర సమన్వయ కమిటీ పర్యటన గ్రాండ్ సక్సెస్**

మంగళగిరి, మచిలీపట్నం వేదికగా జరిగిన ఈ రెండు సమావేశాలకు భారీగా హాజరైన బీసీవై పార్టీ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తమ ఆసక్తిని రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులకు పార్టీ నాయకులు తెలియజేశారుప్రజా సమస్యలపై బీసీవై పార్టీ చేస్తున్న పోరాటానికి ఆకర్షితులై, రెండు ఉమ్మడి జిల్లాల నుండి పెద్ద ఎత్తున బీసీవై పార్టీలో చేరిన ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు. ముఖ్యంగా మహిళల నుంచి విశేష స్పందన రావడం మరియు మహిళా నాయకత్వానికి పెద్దపీట వేస్తున్న బీసీవై పార్టీలో వారు చేరడం రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త మార్పునకు నాంది అని బీసీవై పార్టీ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు తెలిపారు.

# వైకాపా సమన్వయకర్తకు వేణుగోపాల సోమిరెడ్డికి ఘన సన్మానం



**మంగళగిరి, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం ఈమని గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లి ధర్మరత్నం ఆధ్వర్యంలో నియోజకవర్గ సమన్వయకర్త బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డిని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతం, స్థానికంగా పార్టీ కార్యకలాపాలపై నాయకులు చర్చించారు. కార్యక్రమంలో రాచకొండ శ్రీనివాసరావు, కస్తాల శ్రీనివాసరావు, గండికోట శ్రీనివాసరావు, దావీదు, విజయ్, సల్మాన్, లోకేష్, చెన్నయ్య, వీరయ్య, రమేష్, సందీప్, రామకృష్ణతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వాలి

## -వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు షేక్ నాజర్



**పొన్నూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ పట్టణాధ్యక్షుడు షేక్ నాజర్ అన్నారు. నాజ్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పేదలను, అవసరార్థులను ఆదుకునేందుకు సేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలపి పిలుపునిచ్చారు. పట్టణంలోని 29వ వార్డుకు చెందిన మున్నీ కుమార్తె మాహి కౌసర్ అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆమె కుటుంబానికి వైద్యశాల ఖర్చుల నిమిత్తం నాజ్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రూ.5వేలు నగదును నాజర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, నాజ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# ముబారక్ నగర్‌లో అంగన్‌వాడీ ఉత్సవం



**పొన్నూరు, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** పట్టణంలోని ముబారక్ నగర్‌లో శనివారం అంగన్‌వాడీ ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసీడిఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పద్మజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ చిన్నారులకు తల్లిదండ్రులు పౌష్టికాహారం అందించి వారి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడాలన్నారు. అప్పుడే చిన్నారులు ఆరోగ్యవంతుగా ఉంటారని చెప్పారు. అదేవిధంగా గర్భవంతులకు పౌష్టికాహార విశిష్టత గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అనుబంధ పోషకాహారం, పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్య పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, ఆరోగ్యం, పోషకాహారం అంశాలపై ఆమె వివరించారు. అనంతరం ఉత్తమ సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త సపూరాబీ, ఆశ కార్యకర్త జోగి లక్ష్మిలను సత్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు, తల్లులు, గర్భవతులు పాల్గొన్నారు.

# తెదేపా నాయకులు,కార్యకర్తలతో ఎమ్మెల్యే చదలవాడ ఆత్మీయ సమావేశం

**నరసరావుపేట, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా ఎన్నికల పరిశీలకులు కొన్నికళ్ల నారాయణ, పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షులు షేక్ జాన్ సైదా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, నాయకులు-కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై నాయకులు, కార్యర్తలతో చర్చించారు. పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వాసిరెడ్డి రవి, నాగిరెడ్డి, బండారుపల్లి విశ్వేర్వరావు, షేక్ మాబు, గట్టుపల్లి సత్యనారాయణ, షేక్ రఫీతో



పాటు పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సముద్రవేణి మృతికి సంతాపం తెలిపిన మాజీ ఎమ్మెల్యే

**వెల్లలూరు(పొన్నూరు), అక్టోబర్ 3, ప్రభాతవార్త:** జనసేన పార్టీ నాయకుడు, మాజీ జడ్పీటీసి సభ్యుడు కోటా శ్రీనివాసరావు పిన్ని పాకనాటి సముద్రవేణి హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య వెల్లలూరు వచ్చి పాకనాటి సముద్రవేణి మృత దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సముద్రవేణి భర్త విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావును పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే కిలారి వెంట జనసేన పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి వల్లంశెట్టి శ్రీధర్, పట్టణాధ్యక్షుడు షేక్ కరీముల్లా, పట్టణ ఉపాధ్యక్షుడు యరసాని నాగభూషణం, జిల్లా చిరంజీవి యువత కార్యదర్శి మాదాసు అప్పారావు, చందు వెంకటేశ్వర మాస్టర్, సూదా వసంత్, జనసేన గ్రామ పార్టీ



అధ్యక్షుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లెల రాజు, చందనం నాగరాజు తదితరులున్నారు.

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**చిలకలూరిపేట, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** మురికిపూడి గ్రామానికి చెందిన వేముల చిన్న తరపతయ్య 54 అను అతను మద్యం మత్తులో గత నెల 29 తేదీన రాత్రి 8:00 గంటల సమయంలో కూల్ డ్రింకులో ఎలుకల పేస్టు కలుపుకొని త్రాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటుండగా అది చూసిన అతని భార్య సుబ్బాయమ్మ, కుమార్తె వీరలక్ష్మి లు చిలకలూరిపేట ప్రభుత్వా సుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లి అక్కడ నుండి మెరుగని



చికిత్స నిమిత్తం గుంటూరు జి జి హెచ్ కు తీసుకు వెళ్ళగా అక్కడ చికిత్స పొందుతూ ది. 02.10.2026వ తేదీ సాయంత్రం 6.14 గంటల సమయంలో మరణించినట్లు అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయుచున్నాము.

# 12 బస్తాల పిడిఎస్ బియ్యం పట్టివేత

**చిలకలూరిపేట, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** చిలకలూరిపేట పట్టణ పరిధిలో బోసు రోడ్డులో ఎరువుల గోడౌన్ వెనకాల అక్రమంగా శ్రీమతి తన్నీరు నాగమ్మ నిలవజేసిన 12 బస్తాల పిడిఎస్ బియ్యం మొత్తం ఆరు క్వింటాళ్ల స్వాధీనం చేసుకోనడమైనది. శ్రీమతి తన్నీరు నాగమ్మ అక్రమముగా నిల్వ చేసిన వారిపై 6ఏ కేసు నమోదు



చేయడమైనది. ఇందులో అసిస్టెంట్ సప్లై ఆఫీసర్ పల్నాడు జిల్లా శ్రీ షేక్ రోషన్ జమీర్ భాష , డిప్యూటీ తహశీల్దారు వెంకటేశ్వర్లు మరియు విఆర్వో షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

## చిలకలూరిపేటలో 6,7,8 తేదీలలో

# సేవా సేతు అభయాన్

**చిలకలూరిపేట, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** ఈ నెల 6,7,8 తారీఖులో జాతీయ రహదారి రోడ్డు స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న గ్రాండ్ వెంకటేష్ పంక్షన్ హాలు నందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వములు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యాఘరు స్కీమ్ కింద సోలార్ విద్యుత్ వినియోగము, సబ్సిడీ గురించి వినియోగదారులకు అవగాహన కల్పించుటకు సేవా సేతు అభయాన్ అనే కార్యక్రమము నిర్వహించబడును ఆ కార్యక్రమంలో చిలకలూరిపేట టౌన్ 1, టౌన్ 2, రూరల్ చిలకలూరిపేట, ఎడ్లపాడు, గణపవరం విద్యుత్ అధికారులు, సోలార్ కంపెనీ ప్రతినిధులు, బ్యాంక్ అధికారులు పాల్గొని ప్రధానమంత్రి సూర్యాఘర్ కింద సోలార్ రిజిస్ట్రేషన్, బ్యాంక్ సబ్సిడీ గురించి అవగాహన మరియు అక్కడే స్పాట్ రిజిస్ట్రేషన్ బ్యాంక్ లోన్ అప్రూవల్ చేయించబడును కావున చిలకలూరిపేట నియోజకవర్గ విద్యుత్ వినియోగదారులు ఈ సేవా సేతు అభయాన్ కార్యక్రమము లో పాల్గొని సోలార్ విద్యుత్ తో విద్యుత్ ఆదా చేసుకొని భావితరాలకు బంగారు వెలుగులు పంచుదాము.

# ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ఆలంబన సభ్యుల అండ

**తెనాలి అక్టోబర్3 (ప్రభాతవార్త):** ఆపదలో ఉన్న రైతు కుటుంబానికి ఆలంబన అండగా నిలిచింది. ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెంలో



ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని రోజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని ఆలంబన అమరావతి చాప్టర్ సభ్యులు పరామర్శించారు. కుటుంబ పరిస్థితులను తెలుసుకుని తక్షణ సాయంగా రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆలంబన సభ్యులు కాకుమాను సాంబశివరావు, ఈదర వెంకట పూర్ణచంద్, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ఎన్.పూర్ణ చంద్రరావు, రైతు భార్య, తండ్రిని పరామర్శించారు. తండ్రిని కోల్పోయిన ఇద్దరు చిన్నారుల చదువు, సంరక్షణ, భవిష్యత్తు అవసరాలపై ఆరా తీశారు. చిన్నారుల చదువుకు ఆటంకం కలగకుండా వారి అవసరాలకు అనుగుణంగా నిరంతరం అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

# వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

**తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్3(ప్రభాతవార్త):** వాసవి క్లబ్స్ జిల్లా గవర్నర్ పర్యటన తెనాలి పట్టణంలో విజయవంతంగా జరిగింది. వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ నంబూరి నాగభూషణరావు పాల్గొన్న కార్యక్రమంలో పలు క్లబ్బుల నిర్వాహకులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గవర్నర్ చేతుల మీదుగా మెడికల్ క్యాంపు ప్రారంభించి పేద ప్రజలకు వైద్య సేవలు అంద జేశారు.



హరిత బాల కుటీర్ పాఠశాల నిర్మ హకురాలు కృష్ణకుమారి సహకారంతో ఆ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, పేదలకు బియ్యం దుప్పట్లు పంపిణీ చేశారు.

# తిరువూరులో బెంచ్‌ప్రెస్ హోరు

## రాష్ట్రస్థాయి క్రీడాకారులతో సందడిగా పోటీలు

**తిరువూరు, అక్టోబరు 3, ప్రభాతవార్త :** తిరువూరు పట్టణంలో నిర్వహిస్తున్న 13వ ఏపి స్టేట్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మాస్టర్స్ బెంచ్‌ప్రెస్ ఛాంపియన్‌షిప్-2026 పోటీల తొలిరోజు శనివారం ఉత్సాహభరితంగా ముగిసింది. రాష్ట్రం నలుమూలల నుంచి 287 మంది క్రీడాకారులు పాల్గొని తమ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించారు. నాగుబండి రామారావు మెమోరియల్ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఈ రాష్ట్రస్థాయి పోటీలకు విశేష స్పందన లభించింది. వివిధ విభాగాల్లో క్రీడాకారులు హోరాహోరీగా పోటీపడి తమ ప్రతిభను చాటుకోవడంతో కోచ్ అభినందనల వర్షం కురిసింది. తిరువూరు వంటి ప్రాంతంలో రాష్ట్రస్థాయి పవం "లిఫ్టింగ్ పోటీలను నిర్వహించి క్రీడా రంగానికి కొత్త ఊపునివ్వడంలో కోచ్ వి.మల్లేశ్వరరావు చేస్తున్న కృషి అభినందనీయమని క్రీడాభిమానులు



ప్రశంసిస్తున్నారు. క్రీడలపై ఉన్న మక్కువతో పాటు క్రీడాకారుల భవిష్యత్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రతిభావంతులను ప్రోత్సహించడం ఆయన ప్రత్యేకతగా నిలుస్తోంది. స్థానిక ప్రాంతంలోని క్రీడాకారులకు రాష్ట్రస్థాయి వేదికను అందించడంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులను తిరువూరుకు రప్పించి పోటీలను నిర్వహించడం ద్వారా తిరువూరును పవర్‌లిఫ్టింగ్ క్రీడకు ఒక వేదికగా నిలిపేందుకు మల్లేశ్వరరావు చేస్తున్న కృషి ప్రశంసలు అందుకుంటోంది. పవర్‌లిఫ్టింగ్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో క్రీడ కోటా ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉందని కోచ్‌లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడంతో పాటు అవసరమైన అర్హతలు, ధృవపత్రాలు సాధించుకుంటే క్రీడలను మంచి కెరీర్‌గా మలుచుకోవచ్చని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ పోటీల నిర్వహణకు సహకరిస్తున్న ఎన్‌టీఆర్ జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నాగుబండి విశ్వేశ్వరరావు సేవలను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు. క్రీడలకు అండగా నిలుస్తూ పవర్‌లిఫ్టింగ్ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ సౌత్ ఇండియా సెక్రటరీ సకల కోటేశ్వరరావు, జాతీయ అధ్యక్షుడు మద్ది ప్రభాకర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు గంటా వెంకటేశ్వర్లు, రాష్ట్ర సెక్రటరీ సకల సూర్యనారాయణ, జిల్లా సెక్రటరీలు తదితరులు పాల్గొని పోటీలను పర్యవేక్షించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగుబండి మహిధర్ కూడా పాల్గొన్నారు.

# ఉన్నత విద్యావ్యవస్థలో ఫిర్యాదు వ్యవస్థ, కౌన్సిలింగ్ అందుబాటులో ఉండాలి

## -అవగాహన సంస్థ విజ్ఞప్తి

**గుంటూరు కల్చరల్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :** ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న పరిస్థితులు సుప్రీంకోర్టు నియమించిన నేషనల్ టాస్క్‌ఫోర్సు విద్యార్థుల గురించి వెలువరించిన తాజా సర్వే ఆందోళనకర వాస్తవాలను బయటపెట్టింది. ముఖ్యంగా కుల వివక్షపై టాస్క్‌ఫోర్స్ చేసిన పరిశీలనలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది. 2.43లక్షలకు పైగా విద్యార్థుల నుండి సేకరించిన వివరాలు గత ఏడాది కాలంలో చాలా తరచుగా ఆత్మహత్య ఆలోచనలు వచ్చినట్లు 9శాతం మంది విద్యార్థులు తెలియజేయడం, దీర్ఘకాలిక ఒత్తిడి, నిరాశ, ఆలోచనలతో ఇబ్బందులు పడుతున్నట్లు 15శాతం మంది, కులం కారణంగా అవమానాలు, వివక్ష, అధ్యాపకుల నుండి అసమాన వైఖరి వంటి అనుభవాలను ఎక్కువ మంది విద్యార్థులు వెల్లడించినట్లు నివేదిక పేర్కొందని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది. క్యాంపస్‌లో తాము ఏదోస్థాయిలో బయట వ్యక్తులుగా భావిస్తున్నట్లు 34శాతం మంది పేర్కొనటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుందని అవగాహన సంస్థ ఆందోళన ప్రకటిస్తుంది. ఇటీవల దేశంలో ప్రముఖ విద్యాసంస్థల్లో చోటు చేసుకుంటున్న విద్యార్థుల ఆత్మహత్యలు ఈ నివేదిక ప్రాధాన్యతను మరింత పెంచుతున్నాయి. విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి అవసరమైన సహాయక వ్యవస్థ చాలా సంస్థల్లో లేవని...ఉన్నా మొక్కుబడిగా ఉంటున్నాయని అవగాహన సంస్థ విమర్శిస్తుంది. ఈ నివేదికలను దృష్టిలో ఉంచుకొని అయినా కుల వివక్షపై కఠినమైన చర్యలు, సమర్థవంతమైన ఫిర్యాదు వ్యవస్థ, అందుబాటులో కౌన్సిలింగ్, మానసిక ఆరోగ్యంపై శిక్షణ ఇచ్చే విశ్వవిద్యాలయాలు చిత్తశుద్ధితో కృషిచేయాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

# ఎన్నిక ఏకగ్రీవం కాదన్న ఏపి విఆర్ఓ అధికారుల సంఘం

**విజయవాడ, అక్టోబరు 3, ప్రభాతవార్త :** ఏపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందన్న వార్తలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిం ఎం అప్పల నాయుడు ఖండించారు. రాష్ట్రంలో ఎన్నికలు జరగలేదని, ప్రస్తుత అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆధ్వర్యంలోని కమిటీలే యాధావిధిగా కొనసాగుతాయన్నారు. ప్రజాస్వామ్యపద్ధతిలో ఎన్నికలు జరుగుతాయన్నారు. అక్టోబర్ 2న విజయవాడలోని ఏపి ఆర్ఎస్ఎ ఆఫీసులో జరిగిన ఎన్నికలు అప్రజాస్వామికమన్నారు

# అమేజాన్‌లో స్మార్ట్‌ఫోన్ల పై భారీ డీల్స్

**విజయవాడ, అక్టోబరు 3, ప్రభాతవార్త :** ఈనెల 8నుండి జరిగే అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2026లో శాంసంగ్, వన్‌ప్లస్, షయమి, ఇక్యూ, రెడ్మీ తదితర ప్రముఖ బ్రాండ్లస్మార్ట్‌ఫోన్లు యాసెసరీలపై భారీ డీల్స్ ఇస్తామని అమేజాన్ ప్రతినిధులు తెలిపారు. ఎస్బీఐకార్డు కొనుగోలుపై 10శాతం వరకు డిస్కౌంట్లు, ప్రైం సభ్యులకు అదనపు పొదుపు, అమేజాన్‌పే, ఐసిఐసి క్రెడిట్‌కార్డుపై 5శాతం క్యాష్‌బ్యాక్ ఇస్తామన్నారు.